క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నకిరేకల్: నకిరేకల్‌లోని 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సాయి గణేష్ తెలిపారు. పట్టణంలోని వ్యాపారులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేత



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

నల్లగొండ టూటౌన్: జీఓ నంబర్ 11,12ల ప్రకారమే పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ ఎస్‌జీటీ రాష్ట్ర ఫోరం ప్ర. దాన కార్యదర్శి సిరందాసు రామదాసు ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

30వరకు ఉచిత ఆపరేషన్లు

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణంలోని ఐకాన్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ వై. శశీంద్ర ఆధ్వర్యంలో గ్యాస్ట్రో సమస్యలకు ఈ నెల 30 వరకు ఓపీ చూడటంతో పాటు ఆపరేషన్లు కూడా ఉచితంగా నిర్వహిస్తున్నామని ఆ ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్లు శశాంక్ కోడే, రవి శంకర్‌ఖన్నా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోగులు కేవలం మందులు, రక్త పరీక్షలకు అయ్యే ఖర్చులు భరించాల్సి ఉంటుందని తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో ఎండో స్కోపీ చేయబడుతుందని తెలిపారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

నార్కట్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన పేద విద్యార్థులు సంధ్య, మీనాక్షికి ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మేడి హరికృష్ణ ఆదివారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు గడగోజు ఎల్లాచారి, లింగస్వామి, రాజు, నర్సింహ తదితరులు ఉన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

కేతేపల్లి: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో పదేళ్లు రైతులను మోసం చేసిందని విమర్శించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం ఏకకాలంలో రుణమాఫీకి ఆమోదం తెలిపిందన్నారు. రైతుల రుణమాఫీ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి

మర్రిగూడ : గ్రామపంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో 80 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. ఆరు నెలలుగా వారికి జీతాలు అందించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేసి, విడుదలు చేయాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

చిట్యాల: పీఆర్‌టీయూ అసోసియేట్ స్టేట్ ప్రెసిడెంట్, ఐక్య గురుకుల విద్యాలయాల కన్వీనర్ గాదె లింగస్వామి ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. గురుకుల ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఆయన సీఎం కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయ సంఘం నాయులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీలకు న్యాయం చేయాలని వినతి

నకిరేకల్: ఉపాధ్యాయుల పదోన్నతుల్లో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పొట్టబత్తుల పార్థసారధి కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులను అప్‌గ్రేడ్ చేసి వాటిలో ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రతి పాఠశాలకు స్కావెంజర్ పోస్టును మంజూరు చేయాలని సీఎంను కోరారు.

నకిరేకల్ మాజీ సర్పంచ్ రవికుమార్ మృతి

నకిరేకల్: నకిరేకల్ మేజర్ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సకినాల రవికుమార్ (63) అనారోగ్యంలో ఆదివారం మృతిచెందారు. సకినాల రవికుమార్ 2001 నుంచి 2006 వరకు నకిరేకల్ మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా పని చేశారు. నకిరేకల్ మున్సిఫ్ కోర్టులో న్యాయవాదిగా కొన్నాళ్ల పాటు పనిచేశారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోనే నివాసం ఉంటూ హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తున్నారు.

వంట.. తంటా !

- ఆదర్శ పాఠశాలకు మంజూరు కాని వంట గది
- ఇబ్బందులు పడుతున్న ఏజెన్సీ నిర్వాహకులు

కేతేపల్లి: ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి అన్ని హంగులతో నిర్మించిన ఆదర్శ పాఠశాలలో వంటగది మాత్రం నిర్మాణానికి నోచుకోవటం లేదు. నకిరేకల్ నియోజకవర్గం మొత్తం మీద కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో మాత్రమే ఆదర్శ పాఠశాల ఉంది. పన్నెండేళ్ల క్రితం రూ.3 కోట్లతో సువిశాలమైన గదులతో పాఠశాల భవనం నిర్మించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సుశిక్షితులైన ఉపాధ్యాయులను నియమించారు. ఇంత వరకు బాగానే ఉన్నా విద్యార్థులకు మధ్యాహ్న భోజన వంట చేసేందుకు మాత్రం వంటగది మంజూరు కాలేదు. దీంతో ఏళ్ల తరబడి నుంచి మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆరుబైట పందిరి కిందనే వంటలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు.



కొర్లపహాడ్ ఆదర్శ పాఠశాలలో ఆరుబయట మధ్యాహ్న భోజన వంట చేస్తున్న మహిళలు

ఆరుబయటనే..

పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు దాదాపు 400 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేందుకు గది లేకపోవటంతో తాత్కాలికంగా ఏజెన్సీ వారు ఇనుప రేకులు, తాటి కమ్మలతో తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వంటలు చేయాల్సి వస్తుందని ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వీచిన ఈదురు గాలులకు షెడ్డు కూలిపోయింది. అసలే ఈ పాఠశాల గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. వంట సమయంలో వీచే గాలికి కట్టెలు మండక భోజనం, కూగాయలు సరిగా ఉడకటం లేదు. దీంతో పాటు ఆరుబైట వంటలకు రక్షణ ఉండదు. నేలపై మట్టి వంట పదార్థాల్లో కలిసే ప్రమాదముంది. దీంతో ఏజెన్సీ మహిళలు వంట చేయాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో వంటగది నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వంట ఏజెన్సీ మహిళలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



పాఠశాలకు అనుబంధంగా వంట గది ఉండాల్సి ఉన్నప్పటికీ నిర్మాణానికి నోచుకోవటం లేదు. ప్రహరీ పక్కన తాత్కాలికంగా పందిరి వేసుకున్నాము. అది కూలిపోవటంతో ఆరుబటనే వంటలు చేస్తున్నాం. వర్షాలు వచ్చినపుడు మా బాధలు చెప్పనలవి కాదు. నిధులు మంజూరు చేసి వంటగది నిర్మించాలి.

–బయ్య సైదమ్మ, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు

అధికారులకు నివేదించాం



ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వంటగది నిర్మాణానికి గతంలోనే ప్రతిపాదనలు పంపించాము. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మౌలిక వసతుల కల్పనకు పాఠశాలను ఎంపిక చేశారు. వంట గది నిర్మాణానికి ప్రభుత్వం త్వరగా నిధులు మంజూరుచేసేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి.

– సబితారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్

మంత్రి కోమటిరెడ్డికి వినతుల వెల్లువ



నల్లగొండలోని మున్సిపల్ పార్కులో వినతిపత్రాలు తీసుకుంటున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వివిధ సమస్యలపై ప్రజలు భారీ ఎత్తున వినతులు సమర్పించారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయ సమీపంలో గల పార్క్‌లో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యలను విన్న మంత్రి ఫోన్‌లో పలువురు అధికారులతో మాట్లాడి ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పేద విద్యార్థుల చదువు కోసం మంత్రి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థికసాయం

నల్లగొండలోని బోయవాడ ప్రాంతానికి చెందిన హరీష్ కూతురు లితికకు క్యాన్సర్ వ్యాధి సోకింది. 2వ స్టేజిలో ఉన్న క్యాన్సర్ చికిత్సకు డబ్బులు లేక వారు బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ మంత్రి వెంకట్ రెడ్డికి ఆదివారం ఈ సమస్య విన్నవించారు. స్పందించిన మంత్రి వెంటనే రూ.50 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు. చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చు తాను భరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



మంత్రికి సమస్యను విన్నవిస్తున్న బాధిత కుటుంబం

మంత్రి సమక్షంలో పలువురు కాంగ్రెస్‌లో చేరిక

నల్లగొండ మండలానికి చెందిన పలువురు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. పెద్ద సూరారం గ్రామానికి చెందిన పాల సంఘం డైరెక్టర్లు కోట్ల కరుణాకర్‌రెడ్డి, కోట్ల లక్ష్మారెడ్డి , ఎర్రమద నర్సిరెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏడుదొడ్ల వెంకటరామిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి గిరి, ఎంపీటీసీ పెండెం పాండు, ఎర్రమాద రత్నారెడ్డి, వల్లపు కరుణాకర్‌రెడ్డి, రామలింగం, ఎర్రమాద మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మండల స్థాయిలో ప్రజావాణి హర్షణీయం



మాట్లాడుతున్న కత్తుల జగన్‌కుమార్

నల్లగొండ టౌన్ : మండల స్థాయిలోనే ప్రజావాణి నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్ అన్నారు. ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలను విన్నవించడానికి పేదలు దూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి రావడం వల్ల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కలెక్టర్ తీసుకున్న నిర్ణయంతో దూర ప్రాంతాల పేదలు వారి సమస్యలను మండల స్థాయిలోనే ప్రజావాణిలో విన్నవించి పరిష్కరించుకోవచ్చనే విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రజావాణికి దళిత సంఘాలు సహకారం అందిస్తాయని తెలిపారు. సమావేశంలో బాబు జగ్జీవన్‌రామ్ మెమోరియల్ జిల్లా సొసైటీ అధ్యక్షుడు కత్తుల షన్ముఖ కుమార్, ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు కత్తుల మహేశ్వర్, బీఎస్పీ నాయకులు వంటెపాక యాదగిరి, బొజ్జ నర్సింహ, పెరిక చిట్టిబాబు, పెరిక అంజి పాల్గొన్నారు.

జెడ్పీ నిధులు రూ.17 లక్షలు మంజూరు

మునుగోడు: మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తన కోటా నుంచి జెడ్పీ నిధులు రూ. 17 లక్షల నిధులు మంజూరైనట్లు మునుగోడు జెడ్పీటీసీ నారబోయిన స్వరూపారాణిరవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ నిధులతో పులిపలుపుల గ్రామంలో రూ.2 లక్షలతో పైపులైను పనులు, ఇప్పర్తిలో రూ.4 లక్షలతో గ్రామ పంచాయతీ కార్యాలయానికి ప్రహరీ, మునుగోడులో రూ. 3 లక్షలతో మంచి నీటి పైపులైను, చల్మెడ గ్రామంలో రూ. 1.50 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీతో పాటు మునుగోడులోని ముదిరాజ్ గ్రీన్ యార్డ్‌కు రూ. 2లక్షలు, అదే విధంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి రూ. 1.50ల చొప్పున మంజూరైయినట్లు తెలిపారు. త్వరలో ఆ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

బొగ్గు గనుల వేలం పాట నిలిపివేయాలి

నార్కట్‌పల్లి: బొగ్గు గనుల వేలం పాట నిలిపివేసి సింగరేణికే కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి చెరుకు పెద్దులు, వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. వేలం పాటలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొనడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఒక వైపు బొగ్గు బ్లాక్లను వేలం వేస్తూ మరోవైపు సింగరేణి ప్రైవేటీకరించబోమంటూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బుకాయిస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి బయన్న, దండు రవి, నాగరాజు, శంకర్, శ్రీను ఉన్నారు.

వేలం పాట నిలిపివేయాలి

నాంపల్లి : సింగరేణి బొగ్గు గనుల వేలం పాటను కేంద్రం ప్రభుత్వం వెంటనే నిలిపి వేయాలని సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి అదివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఫలితంగా సింగరేణి సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నీట్ పేపర్ లీకేజీ నిందితులను శిక్షించాలి

చిట్యాల: నీట్ పేపర్ లీకేజీ నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) చిట్యాల మండల అధ్యక్షుడు పంది నరేష్ డిమాండ్ చేశారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో ఆదివారం జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నీట్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం గ్రామ అధ్యక్షుడు కురాలకు బాలరాజ్, కార్యదర్శి గోలి సాయికిరణ్, అగ్రూరీ పవన్, అంతటి ఆది ప్రకాష్, గుర్రం అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



నల్లగొండ : బీజేపీ కార్యాలయంలో శ్యామాప్రసాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆయన చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, నూకల వెంకట నారాయణరెడ్డి, చెనమోని రాములు, పోతేపాక లింగస్వామి, మిర్యాల వెంకటేశం, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, గడ్డం మహేష్, వంగూరి రాఖీ, తిరందాసు కనకయ్య, రెవెల్లి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలలో..

చిట్యాల: జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బీజేపీ ఆధ్వర్యంలో మండలంలోని గుండ్రాంపల్లిలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ కన్వీనర్ బందరపు లింగస్వామి, నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గరిషే నరేష్, రాచకొండ నరేష్, లింగస్వామి, నీల నర్సింహ, సిందం లింగస్వామి, రమేష్, రాజశేఖర్, నవీన్ పాల్గొన్నారు.

బంగారిగడ్డలో..

చండూరు : భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని మండలం పరిధిలోని బంగారిగడ్డ గ్రామంలో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాదగోని నాగార్జున, పిన్నింటి నరేందర్ రెడ్డి, ఏనుగు వెంకట్ రెడ్డి, పడసనబోయిన శ్రీను, జెట్టి యాదయ్య, నలపరాజు యాదగిరి, ఇడికుడ మోహన్, బోయపల్లి సాయి, నిమ్మల భిక్షం పాల్గొన్నారు. అదే విధంగా బీజేపీ చండూరు పట్టణ అధ్యక్షుడు పందుల సత్యం గౌడ్ ఆధ్వర్యంలో శ్యామా ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పించారు.

నాంపల్లిలో..

నాంపల్లి : భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దాచపల్లి నర్సింహ, పోగుల వెంకట్‌రెడ్డి, గిరిబాబు, నాంపల్లి సతీష్, కర్నాటి సాంబశివ, గౌరు వెకటయ్య, పోగాకు రాములు, ప్రకాశ్ పాల్గొన్నారు.



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో..



చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో ..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నల్లగొండ : గురువులతో గోల్డెన్ పబ్లిక్ స్కూల్ 1997-98 బ్యాచ్ విద్యార్థులు



నల్లగొండ : గురువులను సన్మానిస్తున్న 2012-13 బ్యాచ్ బీఈడీ విద్యార్థులు



సమావేశమైన మర్రిగూడ మండలం శివన్నగూడ హైస్కూల్ 2002- 03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



ఒకే వేదికపై కట్టంగూర్ ఆదర్శ పాఠశాల 2005-06 బ్యాచ్ విద్యార్థులు

గుడిసెలు వేసుకున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరస్వామి

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణ పరిధిలోని గందంవారిగూడెం సర్వే నంబర్లు 556, 557, 580, 584,585లోని వెంకటరమణ కాలనీలో కొన్నేళ్ల క్రితం గుడిసెలు వేసుకున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ నియోజక వర్గ ఇన్‌చార్జి పబ్బు వీరస్వామి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానికంగా జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో విశ్వనాథుల లెనిన్ బాబు, పుట్టం సుజాత, చిత్రంయాదగిరి, కోటి లింగం, ఎస్‌డి. నజీర్, గురవయ్య పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక వృద్ధి

నల్లగొండ టూటౌన్: మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడంతో శారీరక, మానసిక అభివృద్ధి పెరుగుతుందని నల్లగొండ వన్‌టౌన్ ఎస్‌ఐ శంకర్ అన్నారు. నల్లగొండలో సన్ లైట్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించిన సందర్భంగా ఆయన విజేతలకు బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్ అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు రమేష్, జగన్, నాగరాజు పాల్గొన్నారు.



బెల్టులు అందుకున్న విద్యార్థులు

విద్యుదాఘాతంలో రెండు గేదెలు మృతి

కేతేపల్లి: విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాలు.. భీమారం గ్రామానికి చెందిన చిముట అంజనేయులు వ్యవసాయ బావి సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు దిమ్మెను తక్కువ ఎత్తులో నిర్మించాడు. ఆదివారం గ్రామ వాసి గోసుల వెంకన్నకు చెందిన రెండు పాడి గేదెలు మేత మేసేందుకు గ్రామ శివారులోకి వెళ్లగా.. అంజేయులు వ్యవసాయ బావి వద్ద తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. మృతిచెందిన గేదెల విలువ రూ.1.50 లక్షలకు పైగానే ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

మాంద్ర గ్రామంలో ఆవు..

నార్కట్‌పల్లి: మండలంలోని మాంద్ర గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందింది. వివరాలు.. మాంద్ర గ్రామానికి చెందిన దొండ నర్సింహ ఆవు మేత మేసుకుంటూ తన వ్యవసాయ బావి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన ఆవు విలువ రూ.30వేలు ఉంటుందని బాధిత రైతుల తెలిపాడు.

పైకప్పు పెచ్చులూడుతున్నా పట్టింపేదీ?

- శిథిలావస్థలో మునుగోడు ఎస్సీ బాలుర వసతిగృహం
- వర్షాలకు కురుస్తున్న హాస్టల్ గదులు
- విద్యా సంవత్సరం ప్రారంభమైనా భయంతో హాస్టల్‌కు రాని విద్యార్థులు
- అద్దెభవనంలో విద్యార్థులకు వసతి కల్పించాలంటున్న విద్యార్థి సంఘాల నాయకులు

మునుగోడు: మునుగోడులోని ఎస్సీ బాలుర వసతిగృహం శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు స్లాబ్ కింది పెచ్చులు ఊడి కిందపడుతున్నాయి. అయినా, అధికారులు మాత్రం విద్యార్థులకు ఆ గృహంలోనే వసతి ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో భవనం పైకప్పు ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. హాస్టల్ పరిస్థితి చూసిన కొందరు తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లి చదివించుకుంటున్నారు.



శిథిలమైన ఎస్సీ బాలుర వసతిగృహం

మూడు దశాబ్దాల క్రితం హాస్టల్ నిర్మాణం

మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో 1993వ సంవత్సరంలో ఎస్సీ బాలుర వసతిగృహాన్ని నిర్మించారు. ప్రారంభం నుంచి ప్రతి యేటా 150మందికి పైగా విద్యార్థులు వసతి పొందుతూ విద్యను అభ్యసించారు. ఏటేటా భవనం పాతబడి శిథిలావస్థకు చేరడంతో పదేళ్ల క్రితం ప్రభుత్వం మరమ్మతులు చేయించింది. గడిచిన ఐదేళ్లుగా హాస్టల్ భవనం కురుస్తుండడంతో విద్యార్థులు అందులో చేరేందుకు జంకుతున్నారు. గత ఏడాది హాస్టల్‌లో చేరే విద్యార్థుల సంఖ్య క్రమంగా 40కి తగ్గిపోయింది. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమైనా హాస్టల్‌లో చేరేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. ఇప్పటికై నా సంబంధిత అధికారులు ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అద్దెభవనంలో వసతి కల్పించి హాస్టల్‌ని ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.



స్లాబ్ పైకప్పు పెచ్చులూడిన దృశ్యం

వేసవిలోనే అద్దె భవనం తీసుకుని ఉండాలి



హాస్టల్ భవనం పూర్తిగా శిథిలమైన విషయం తెలిసి కూడా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా నేటికీ హాస్టల్ విద్యార్థులకు వసతి కల్పించడం లేదు. శిథిలమైన గదుల్లో ఉంటే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. వెంటనే అద్దె భవనం తీసుకుని హాస్టల్‌ను ప్రారంభించాలి.

–చాపల విప్లవ్, ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి

అద్దె భవనం కోసం వెతుకుతున్నాం

హాస్టల్ భవనం నిర్మించి మూడు దశాబ్దాలకు పైగా గడిచిపోవడంతో శిథిలావస్థకు చేరింది. మరమ్మతులు చేయించినా తిరిగి అలాగే పెచ్చులు ఊడుతున్నాయి. ఏటేటా విద్యార్థుల సంఖ్య తగ్గి గత ఏడాదికి 40 మందికి చేరింది. ఆ విద్యార్థులు కూడా ఈ ఏడాది హాస్టల్‌కు రావడం లేదు. దీంతో ఎక్కడైనా అద్దె భవనం దొరికితే అందులో హాస్టల్‌ను ప్రారంభించాలని వెతుకుతున్నాం.

– లింగయ్య, హాస్టల్ వార్డెన్